## క్లుప్తంగా

### త్యాగాలకు ప్రతీక మొహర్రం



**కూకట్‌పల్లి:** మొహర్రం సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని రాజీవ్‌గాంధీనగర్, సంగీత్‌నగర్‌లలో పీర్ల ఆలం వద్ద శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగాలకు ప్రతీక మొహర్రం పండుగ అని తెలిపారు. కార్యక్రమంలో ఎండీ ఖాదర్, రుకుమొద్దిన్, బాబుబాయ్ పాల్గొన్నారు.

### ఉచిత వైద్యశిబిరం

**హఫీజ్‌పేట్ :** హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియ అపార్ట్‌మెంట్స్ 5వ ఫేజ్‌లో కల్వరి టెంపుల్ హాస్పటల్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మియాపూర్ ఏసీపీ నర్సింహారావు, సీఐ ప్రేమ్‌కుమార్‌లు ప్రారంభించారు. హాస్పటల్ ఎండీ డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో నివసించే పేదప్రజలకు ఉచిత మెడికల్ క్యాంపులను నిర్వహిస్తున్నామన్నారు.ఈ వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి మందులను అందించారు. కార్యక్రమంలో జయరాం, రాజాశ్రీధర్, రాజశేఖర్, డాక్టర్లు విజయ, చంద్రిక, సుమీర్, సంజీవరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్‌కు ఘన నివాళి

**గచ్చిబౌలి:** మాజీ మంత్రి మూల ముఖేష్‌గౌడ్ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయనకు పలువురు నివాళులర్పించారు. ముఖేష్‌గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్ నివాళులు అర్పించారు. పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

### షర్బత్ పంపిణీ

**గచ్చిబౌలి:** మొహర్రంను పురస్కరించుకొని ఊరేగింపులో పాల్గొన్న వారికి షర్బత్ పంపిణీ చేశారు. సిద్ధిఖ్‌నగర్‌లో కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్, ఇతర నాయకులు పీర్లకు కానుకలను సమర్పించారు.

### ఫుట్‌పాత్ వ్యాపారులకు జరిమానా

**బంజారాహిల్స్:** ఫుట్‌పాత్‌లను ఆక్రమించి పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్న వ్యాపారులకు బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధించారు. బంజారాహిల్స్ రోడ్ నెం.12తో పాటు రోడ్ నెం. 1, ఫిలింనగర్ అవుట్‌పోస్టు వద్ద ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన వ్యాపారులకు ఎస్ఐ రాకేష్‌రెడ్డి జరిమానాలు విధించి అవగాహన కల్పించారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించవద్దని వెనక్కి జరిగి వ్యాపారం చేసుకోవాలని పాదచారులకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు.

### సిగ్నల్ పడ్డా ఆగేదిలేదు..

**రామచంద్రాపురం(పటాన్‌చెరు) :** తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్, తెల్లాపూర్ వెళ్లే మార్గంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సిగ్నళ్లు ఏర్పాటు చేసినా సమస్యలు తప్పడం లేదు. గతంలో ఈ ఏరియాలో ఉదయం, సాయంత్రం సమయంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండేది. ఈ సమస్యను పరిష్కరించేందుకు రైల్వే అండర్ బ్రిడ్జిని వెడల్పు చేయాలన్న ప్రతిపాదనలు ముందుకు వచ్చాయి. నిత్యం వాహనదారులు ఇబ్బందులు పడుతుంటే సమస్య పరిష్కారం కోసం తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలితసోమిరెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ట్రాఫిక్ సిగ్నల్‌లను ఏర్పాటు చేయించారు. రెండు రోజులు ట్రాఫిక్ సిబ్బంది ఉండడంతో వాహనదారులు సిగ్నల్‌లను పాటించారు. ప్రస్తుతం కొంతమంది వాహనదారుల తీరు వలన ట్రాఫిక్ సమస్య మొదటికి వస్తుంది. రెడ్‌లైట్ పడినప్పటికి కొంతమంది వాహనదారులు ముందుకు వెళ్తూ ఎదురుగా వచ్చే వారిని ఇబ్బందికి గురి చేస్తున్నారు. తిరిగి ఎప్పటిలాగే ట్రాఫిక్ సమస్య ఎర్పడుతుంది. ఇప్పటికైన ట్రాఫిక్ పోలీసు అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

### సంకీర్తనార్చన



**మాదాపూర్:** మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో ప్రతి వారం నిర్వహించే కార్యక్రమాలలో భాగంగా శనివారం సిద్దార్థ్ బోయ సంకీర్తనార్చన చేశారు. అన్నమయ్య స్వరార్చనలో భాగంగా తిరుమల గిరిరాయ,చక్కని తల్లికి, ఇట్టి ముద్దు, శరణు శరణు అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. వయోలిన్ శ్రీనివాసాచార్యులు, మృదంగం కౌండిన్యులు వాయిద్య సహకారాన్ని అందించారు.

# వరదనీటిలోనే గురుగోవింద్ కాలనీ

- తమను ఆదుకోవాలని కాలనీవాసుల వినతి
- గత అనుభవాలను పట్టించుకోని అధికారులు







గురు గోవింద్ సిక్కు కాలనీలో వరద ముంపు, రహదారులపై ప్రవహిస్తున్న వర్షపునీరు

**ఆల్విన్‌కాలనీ:** వర్షాలు తగ్గుముఖం పట్టినా గురు గోవింద్ సిక్కు కాలనీలో ఇంకా వరద నీరు పారుతూనే ఉంది. ఇళ్లలోకి నీరు చేరడంతో సరుకులు తడిచిపోయాయని, కాలనీలో అపరిశుభ్రత తాండవిస్తోందని తమను ఆదుకోవాలని పేదలు మొరపెట్టుకుంటున్నారు. ప్రతి ఏటా తమ కాలనీలో ఇదే పరిస్థితి నెలకొంటోందని వాపోయారు. ప్రభుత్వం ముందుచూపు లేకపోవటం వల్లనే ఏటా అవస్థలు పడాల్సి వస్తోందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులు సమస్య ఉత్పన్నమైనప్పుడు తాత్కాలిక చర్యలతో సరిపెడుతున్నారని సిక్కు కాలనీవాసులు మండిపడుతున్నారు.

- కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ డివిజన్ గురు గోవింద్ సిక్కు కాలనీలోకి గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువన ఉన్న గుట్టలు, క్వారీ గుంతల్లో నీరు నిలిచిపోయి సిక్కు కాలనీ గుండా ప్రవహిస్తూ ఇళ్లల్లోకి చేరింది. సరుకులు, గృహోపకరణాలు నీళ్లలో తడిచిపోవటంతో పాటు వారు ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొంది.
- స్థానికంగా పరికి చెరువుతో పాటు ఓపెన్ నాలా, క్వారీ గుంతలు, దట్టమైన కొండలు ఉండటంతో ఈ కాలనీ వాసులకు వర్షం వచ్చిందంటే హడలే. ప్రతి వర్షాకాలం వరద నీటితో పాటు విష సర్పాలు, క్రిమీ కీటకాలు కూడా చేరుతుండటంతో నానా ఇబ్బందులుపడుతున్నారు. అపరిశుభ్రత తాండవిస్తుంది. ప్రతి సంవత్సరం ఇదే దుస్థితి అని వారు వాపోతున్నారు.
- నాలుగు దశాబ్దాల క్రితం నగరంలో రోడ్డు పక్కన గుడిసెలు వేసుకొని నివసిస్తున్న సిక్కులను గుర్తించి ఎల్లమ్మబండలో ఇళ్లు నిర్మించి వారికి అందజేశారు.అయితే ఈ ఇళ్లు చాలా చిన్నవి కావడంతో అలాగే నెట్టుకొస్తున్నారు.
- గత వర్షాకాలంలో ఈ కాలనీలో డెంగ్యూ, మలేరియా జ్వరాలతో చిన్నారులు మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు ముందుచూపుతో వరద నీరు పోయేలా చర్యలు తీసుకోవటంతో పాటు ఈ కాలనీలో ఉచిత వైద్య శిబిరాలు, పారిశుద్ధ్యం పనులు, బ్లీచింగ్ చల్లడం, రాత్రి వేళ దోమల నివారణకు ఫాగింగ్ తదితర చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### సరుకులు కొట్టుకుపోయాయి



వర్షపు నీరు ఇళ్లల్లో చేరడంతో నిత్యావసర వస్తువులు నీటిలో కొట్టుకుపోయాయి. చిన్న పిల్లలతో పాటు గర్భిణులు, బాలింతలు ఉన్నారు. జ్వరాలు వస్తున్నాయి. మమ్మల్ని ఆదుకునే వారు లేరు. ప్రతి సంవత్సరం ఇదే పరిస్థితి. ముందస్తుగా చర్యలు తీసుకోకపోవటం వల్లనే సమస్య ఉత్పన్నమవుతోంది. శాశ్వత పరిష్కారం చూపాలి.

–మంజిత్ కౌర్, సిక్కుల కాలనీ

### మమ్మల్ని ఆదుకోవాలి



గత సంవత్సరం ఇదే సీజన్‌లో విష జ్వరాలు వచ్చాయి. పేద ప్రజలు ఎక్కువగా నివసిస్తుంటారు. రోగాలు వస్తే ఏమి చేయాలో తెలియని పరిస్థితి. ముందస్తుగా అధికారులు, ప్రజా ప్రతినిధులు మా కాలనీలో పారిశుద్ధ్య పనులు, వైద్య శిబిరాలు నిర్వహించాలి. నిత్యావసర వస్తువులు నీట మునిగాయి. మా కాలనీవాసులను ఆదుకోవాలి.

–అనిత, సిక్కుల కాలనీ

- సిక్కుల కాలనీలో ఎక్కువ శాతం పేదవారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## అధైర్య పడవద్దు.. అండగా ఉంటాం



గురు గోవింద్‌సింగ్ సిక్కు కాలనీలో పరిస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

**ఆల్విన్‌కాలనీ:** ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని గురుగోవింద్ సింగ్ కాలనీ, పీజేఆర్‌నగర్ ఫేజ్ -1 కాలనీలోని వరద ముంపు ప్రాంతాల్లో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శనివారం పర్యటించారు. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, సీఐ క్రాంతికుమార్, జీహెచ్‌యంసీ అధికారులతో కలిసి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అధైర్య పడవద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎడతెరిపి లేని వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఫొటోలకు ఫోజులు ఇచ్చి, ఇష్టారీతిగా మాట్లాడుతున్నారని, వారంతా టూరిస్టులను ఎద్దేవా చేశారు. నిత్యం ప్రజల మధ్యన ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ అభివృద్ధికి సుమారు రూ.180 కోట్లు కేటాయించి అనేక అభివృద్ధి పనులు చేపట్టామని వెల్లడించారు. నీటి ప్రవాహానికి అడ్డంగా కట్టిన ఓ బిల్డింగ్ వల్ల సిక్కుల కాలనీలో ఇళ్లలోకి నీరు వచ్చి చేరిందని, ఆ బిల్డింగ్ ఎలా కట్టారని, అనుమతులు ఎవరు ఇచ్చారనే దానిపై ఇప్పటికే జోనల్ కమిషనర్ విచారణ చేపట్టారని, భవిష్యత్‌లో అలాంటి నిర్మాణాలు జరగకుండా, లోతట్టు ప్రాంతాలు మునగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీకాంత్, అధికారులు ఏఐ శ్రావణి, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్, డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

### ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మరిచారు

**నిజాంపేట్:** ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు విఫలయ్యారని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ఎన్నికల హామీలను నెరవేర్చాలని కోరుతూ నిజాంపేట్ హనుమాన్ ఆలయం నుండి భవ్యాస్ ఆనంద్ ఆపార్ట్‌మెంట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే వివేకానంద్ ప్రగతినగర్ నుండి జెఎన్‌టీయు వరకు 100 ఫీట్ల రోడ్డు, ఫ్లైఓవర్, బాచుపల్లి చౌరస్తా నుండి నిజాంపేట్ వరకు రేడియల్ రోడ్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎన్నికల అనంతరం ఆ మాటే మరిచారన్నారు. అదే విధంగా ప్రగతినగర్ అంబీర్ చెరువును శుద్ధి చేసి సుందరీకరిస్తామన్న మంత్రి కేటీఆర్ ఆ తరువాత ముఖం చాటేశారని ఎద్దేవా చేశారు. నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

### యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్‌గా మర్రి లక్ష్మణ్ రెడ్డి

**దుండిగల్:** తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ గా ఎంఎల్‌ఆర్‌ఐటీ విద్యా సంస్థల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాభివృద్ధితో పాటు క్రీడలకు మొదటి నుంచి మంచి ప్రాధాన్యతనిస్తున్న మర్రి లక్ష్మారెడ్డిని రాష్ట్ర సంఘ చైర్మన్ గా నియమించుకున్నామని, సైక్లింగ్, స్విమ్మింగ్, రన్నింగ్ తదితర వాటిల్లో జాతీయస్థాయిలో పాల్గొని అనేక విజయాలు సాధించారన్నారు. రాష్ట్ర నూతన చైర్మన్ గా ఎన్నికైన మర్రి లక్ష్మణ రెడ్డి మాట్లాడుతూ యోగాసనా పోటీలను అన్ని జిల్లాకు విస్తరిస్తామన్నారు. తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి .శ్రీధర్ రావు, ఉపాధ్యక్షులు రామచంద్రం , జాయింట్ సెక్రెటరీ రాంరెడ్డి ,సతీష్ గోపాలకృష్ణ, రాజారెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### బురదలో కూరుకుపోయిన భారీ వాహనం

**సుభాష్‌నగర్:** కొంపల్లి – బహదూర్‌పల్లి ప్రధాన రహదారిలోని దులపల్లి బ్రిడ్జి వద్ద శనివారం ఓ భారీ వాహనం బురదలో కూరుకపోయింది. కల్వర్ట్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు బురద మయంగా మారడంతో వాహనం కూరుకుపోయింది. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్ జామై వాహన రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సహాయంతో బురదలో కూరుకుపోయిన లారీని బయటకు తీసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

# మణిపూర్ ఘటనపై నిరసన ర్యాలీ



నిరసన ర్యాలీలో పాల్గొన్న క్రిస్టియన్లు

**కూకట్‌పల్లి:** మణిపూర్ ఘటనకు నిరసనగా కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లో చర్చ్ పాస్టర్లు, క్రిస్టియన్ లీడర్ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీ రాజేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు తదితరులు పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. భారతదేశం చాలా ప్రశాంతంగా ఉండేదని, అయితే బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన 9 సంవత్సరాల్లో కులాల మధ్య, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టి రెచ్చగొట్టి విభేదాలు తీసుకువస్తున్నారన్నారు. అందులో భాగంగా మణిపూర్‌లో గతంలో చర్చిలను కూల్చివేయటం, మహిళలకు అఘాయిత్యాలు చేయటం, క్రిస్టియన్లను చంపివేయటం బాధాకరమైన విషయమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని మతాలను, కులాలను సమానంగా చూసే ముఖ్యమంత్రి కేసీఆర్ తమ పార్టీ ఎంపీలతో మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా పార్లమెంటులో సైతం నిరసన వ్యక్తం చేసి మోడీపై అవిశ్వాస తీర్మానంలో సైతం పాల్గొన్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో అల్లర్లు ఆగాలని, శాంతి నెలకొల్పాలని, ప్రజలందరూ స్వేచ్ఛగా బ్రతికేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, పాస్టర్లు ఎడ్వర్డ్ రోస్, కొర్నే మోజెస్, మాణిక్యం, ఇశ్రాయిల్, ఏసుపాదం, టీఆర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు తీసుకురండి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

**ఓల్డ్‌బోయిన్‌పల్లి:** కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేపట్టనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ కోరారు. శనివారం తన నివాసంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. అగష్టు 1 నుంచి ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని వివిధ ప్రాంతాలలో పాదయాత్ర నిర్వహిస్తారన్నారు. స్థానికంగా ఏ సమస్య ఉన్నా ప్రజలు తప్పనిసరిగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలన్నారు. అ సమస్యను అధికారులతో అప్పటికప్పుడు పరిష్కారించడంతో పాటు సమస్యలకు చెక్ పెట్టడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా నాయకులు కార్యకర్తలు ఎవరి ప్రాంతంలో వారు పాదయాత్రను జయప్రదం చేసేలా చూడాలని అన్నారు. సెప్టెంబర్ 23వ తేది వరకు నియోజకవర్గంలోని అన్నీ డివిజన్లలో పాదయాత్ర ఉంటుందన్నారు.

## బీజేపీ కార్యకర్తల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న మాధవరం కాంతారావు, నాయకులు, కార్యకర్తలు

**కూకట్‌పల్లి:** జాతీయ బీజేపీ ఉపాధ్యక్షులుగా రెండోసారి డీకే అరుణ, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్‌కు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ శనివారం బీజేపీ అధిష్టానం అధికారికంగా ప్రకటించింది. దీంతో శనివారం కూకట్‌పల్లిలోని బీజేపీ కార్యాలయం వద్ద అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, నాయకులు, కార్యకర్తలతో కలిసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం బాణసంచా పేల్చి స్వీట్లు పంచుకుని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అవినీతిరహిత పాలనను అందించి, కుటుంబ పాలన అంతం చేసే పార్టీ కేవలం బీజేపీ మాత్రమే అన్నారు. కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జి శ్రీకర్‌రావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, దేశబత్తుల సుధారవి, వినోద్, శ్రీనివాస్, మల్లేష్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కార్యకర్తలు పాల్గొన్నారు.

### రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

**దుండిగల్:** ఆగస్టు 5లోపు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మాధవరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 18నుంచి 59సంవత్సరాల లోపు ఉన్న రైతులు, 2023 జూన్ 18 లోపు వరకు ధరణి డేటా ప్రకారం కొత్తగా భూమి పాసు బుక్కులు పొంది ఉండాలని, అర్హులైన కొత్త రైతులు వెంటనే భూమి పాసు బుక్కులు, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్‌లను అందజేయాలని కోరారు. వివరాలకు మండల వ్యవసాయ అధికారి 7288894684లో సంప్రదించవచ్చు.

### విదేశాల్లో 20 వేల మంది ఎంఎల్‌ఆర్‌ఐటీ విద్యార్థులు

**దుండిగల్:** ఇప్పటి వరకు తమ కళాశాలలో విద్యను అభ్యసించిన 20 వేలకు మంది మంది విద్యార్థులు దేశ, విదేశాల్లో స్థిరపడి ఉద్యోగాలు చేస్తున్నారని ఎంఎల్‌ఆర్ఐటి కళాశాల కార్యదర్శి మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని రాడిసన్ హోటల్‌లో శనివారం ఎంఎల్ఆర్ ఐటి విద్యా సంస్థలు ఇండస్ట్రీ రిక్రూటర్‌లకు థ్యాంక్స్ గివింగ్ డే ని నిర్వహించింది. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంఎల్ఆర్ఐటి సంస్థ 18 సంవత్సరాల ప్రయాణంలో ఎంతో మంది పరిశ్రమల సహకారంతో అనేక మైలు రాళ్లను సాధించిదన్నారు. 2022–23 విద్యా సంవత్సరంలోనే వెయ్యి మంది విద్యార్థులు బహుళ జాతి సంస్థల్లో ఉద్యోగాలు పొందారని,ముగ్గురు విద్యార్థులు సంవత్సరానికి రూ. 58 లక్షల ప్యాకేజీని తీసుకుంటున్నారన్నారు. స్కోప్ (స్కూల్ ఆఫ్ ప్రోగ్రామింగ్ అండ్ ఎక్సలెన్స్) ద్వారా విద్యార్థులకు కోర్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లపై శిక్షణ ఇవ్వడంతో పాటు ప్లేస్‌మెంట్‌లను కల్పించడంలో ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. థ్యాంక్స్ గివింగ్ డే ద్వారా ఇంత ఈవెంట్‌ను నిర్వహించడంతోపాటు పరిశ్రమ నిపుణులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చినందుకు టీమ్ ట్రైనింగ్, ప్లేస్‌మెంట్‌లను ఆయన అభినందించారు.

### 600 మందికి కంటి పరీక్షలు

**నిజాంపేట్:** బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (వీఎన్ఆర్ విజేఐటీ) కళాశాలలో శనివారం సోలిస్ ఐకేర్ ఆస్పత్రి, క్లోవ్ డెంటల్ ఆస్పత్రుల సౌజన్యంతో విద్యార్థులు, టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్‌కు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలతో, పంటి పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేవారు. సుమారు 600 మంది ఈ శిబిరంలో పరీక్షలు చేయించుకోగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీడీ నాయుడు మాట్లాడుతూ తమ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో డాక్టర్ పద్మశాయి, డాక్టర్ చెన్నకేశవరావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

# యూపీఎస్‌సీ విజేతకు ఎమ్మెల్యే సత్కారం



సాయిఅశ్రిత్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

**ఆల్విన్‌కాలనీ:** అత్యున్నత స్థాయి పరీక్ష యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్స్‌లో అతి పిన్న వయసులోనే మొదటి ప్రయత్నంలో 40వ ర్యాంక్‌ను వరంగల్‌కు చెందిన శాఖమూరి అమరలింగేశ్వర్, పద్మజల కుమారుడు సాయి ఆశ్రిత్ సాధించారు. ఈ సందర్భంగా శనివారం సాయి ఆశ్రిత్‌ను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ 22 ఏళ్ల అతి చిన్న వయసులోనే ఐఏఎస్ సాధింటం చాలా గొప్ప విషయమన్నారు. దేశంలోనే అత్యున్నత స్థాయి ఉద్యోగమని, ఎంతో మందికి సాయి ఆశ్రిత్ స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. భవిష్యత్‌లో మరిన్ని శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా సాయి ఆశ్రిత్ తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు.

### పాడి రైతులకు అండగా ఉంటాం

**దుండిగల్:** పాడి రైతులకు అండగా ఉంటామని దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్లు అభయ హస్తం ఇచ్చారు. ఇటీవల దుండిగల్ గ్రామానికి చెందిన పిట్ల శంకర్ కు చెందిన గేదెలు ఇటీవల మృతి చెందిన సంఘటన విషయం తెలిసిందే. కాగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆదేశాల మేరకు కౌన్సిలర్లు ఆర్థిక సహాయం ప్రకటించారు. రూ.లక్ష చెక్కును బాధితుడికి శనివారం శంభీపూర్‌లోని పార్టీ కార్యాలయంలో అందజేశారు. కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, జక్కుల కృష్ణ యాదవ్, గోపాల్‌రెడ్డి, ఆనంద్, భరత్, నేతలు వెంకటేశ్, మల్లేశ్ ముదిరాజ్, జక్కుల శ్రీనివాస్ యాదవ్, ప్రేమ్ కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేయం


**నిజాంపేట్:** అభివృద్ధి పనుల విషయంలో ఎన్ని నిధులు ఖర్చయినా వెనకడుగు వేసేది లేదని నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. శనివారం నిజాంపేట్ 3వ డివిజన్ కార్పొరేటర్ వెంకటరామయ్య మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో డ్రైనేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, భూగర్భ డ్రైనేజీ లైన్‌ను మంజూరు చేయాలని విన్నవించగా మేయర్ సానుకూలంగా స్పందించారు. ప్రతి డివిజన్‌లో మౌలిక వసతులు మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు.



### కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

**కుత్బుల్లాపూర్:** బంగారు తెలంగాణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. శనివారం సూరారం కృష్ణనగర్‌కు చెందిన జిల్లా ఓబీసీ మోర్చా ఎగ్జిక్యూటీవ్ మెంబర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారిని హన్మంతరెడ్డి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పేదలకు ఇందిరమ్మ గృహాలకు రూ.5లక్షలు, రూ.500 లకే గ్యాస్ సిలీండర్‌లను అందిస్తామన్నారు. మోహన్‌రెడ్డి, అబ్బాస్, లక్ష్మణ్‌ముదిరాజ్, భాను ప్రసాద్ తదితరులు పార్టీలో చేరారు.

# అపరిచితుల మెసేజ్‌లకు స్పందించకండి



కార్యక్రమంలో పాల్గొన్న సనత్‌నగర్ సీఐ బాలరాజు, సంక్షేమ సంఘాల నాయకులు

**మోతీనగర్:** అపరిచిత వ్యక్తులు ఫోన్లో కుటుంబ సభ్యులు అనారోగ్యంతో ఉన్నారని, ఆపదలో ఉన్నారని వాట్సాప్, ఇన్‌స్టాగామ్, ఫేజ్‌బుక్‌లో మెసేజ్ పెడితే స్పందించకూడదని సనత్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాలరాజు యాదవ్ పేర్కొన్నారు. శనివారం మూసాపేట డివిజన్ పాండురంగ నగర్ సంక్షేమ సంఘం సమావేశ మందిరంలో సైబర్ నేరాలపై డివిజన్‌లోని సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సిఐ బాలరాజు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఫోన్లు చేసి మీకు లాటరీ తగిలిందని, బంగారం వచ్చిందని, మీకు లక్కీ డ్రాలో కార్లు గెలుపొందారని ఇటువంటి సందేశాలకు నమ్మి డబ్బులు పంపవద్దని తెలిపారు. అనుమానస్పదంగా ఎవరైనా సంచరించినా, తరుచూ ఫోన్లు చేసినా అట్టివారిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.